

# మాతృదేవోభవ

## ప్రతి నెలా ఒక పాఠకుడి / పాఠకురాలి మాతృమూర్తికి వందనాలు హరిచందనాలు

సుధ నాగళ్ళ

అమ్మ! ఈ ప్రపంచంలో అమ్మ లేని మనిషి లేడు. అమ్మ లేకుండా మనిషే లేడు. అమ్మ అంటే నిస్వార్థం. అమ్మ అంటే సదా పిల్లల క్షేమం కోరే దేవత. నేను ఇంతకు ముందెప్పుడూ ఏమీ రాయకపోయినా కౌముదిలో మాతృదేవోభవ శీర్షిక సంవత్సరం పైగా చదివి అమ్మ మీద ఏమైనా రాయాలనిపించింది.

మా అమ్మ పేరు బాలా త్రిపుర సుందరి. కాలానుగుణంగా సుందరమ్మగా రూపాంతరం చెందింది. నాన్నపేరు వెంకటప్పారావు. అమ్మ 1928 జనవరిలో పుట్టిందట. అప్పట్లో పుట్టిన తేదీ సమయం రికార్డు చేసి గుర్తుంచుకునే అలవాట్లు లేని మధ్యతరగతి కుటుంబం తనది. అమ్మ పుట్టింది గుంటూరు జిల్లాలోని వెల్లటూరు. నాన్నది అనంతవరం. పెళ్ళయ్యాక కొంతకాలం పెనుమూడిలో ఉండి, దాదాపు శేషజీవితం అంతా రేపల్లెలోనే గడిపారు.

అమ్మమ్మ జన్మనిచ్చిన పదిమందిలో అమ్మ ఆఖరి సంతానం. అమ్మ జన్మనిచ్చిన పదిమందిలో నేను ఆఖరుదాన్ని. ఆఖర్న పుట్టానని అమ్మ ఎందులోనూ నాకు తక్కువచేయలేదు. తను చదువుకోకపోయినా తన పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని తపన పడింది. ఒక వైపు పిల్లల్ని కంటూ, పెంచుతూనే నాన్నకి వ్యాపారంలో చేదోడు వాదోడుగా నిలిచింది. ఏ రోజూ తన సుఖంకోసం తాపత్రయపడలేదు. పిల్లల సుఖమే తనసుఖం అనుకుంది.

మొదట్లో నాన్నకి సినిమా హాల్లో కేంటీన్ ఉండేది. మా రెండో అక్క పుట్టాక రేపల్లె ఊళ్ళో సొంతంగా టిఫిన్ సెంటర్ ప్రారంభించారు. తరువాత అన్నయ్యలు ఆ వ్యాపారాన్ని బాగా విస్తరించి పలుచోట్ల టిఫిన్ సెంటర్‌లు మొదలుపెట్టారు. ఆ సెంటర్‌లకి కావల్సిన ఇడ్లీ, దోసె, వడ లాంటివన్నీ ఇంట్లోనే చేసి ఇచ్చేది అమ్మ. ఎప్పుడూ ఐదారు గేదెలకి తగ్గకుండా చూసుకుంటూ పాలు కూడా



తనే పితికి హోటళ్ళకి ఏమాత్రం ఇబ్బంది లేకుండా చూసుకునేది. నా చిన్నప్పుడు అమ్మ ఆ విధంగా నిరంతరం క్షణమైనా విశ్రాంతి తీసుకోకుండా పనిచేయడం ఇంకా నా కళ్ళముందు నిన్నా మొన్నటిలా కదులుతుంది. అమ్మకి ఎప్పుడైనా విశ్రాంతి తీసుకోవడమంటే సినిమాకి వెళ్ళడమే.!

కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవలు, మనవరాళ్ళు, ముని మనవలు, ముని మనవరాళ్ళు ఎప్పుడూ సుఖంగా సంతోషంగా ఉండాలని కోరుకుంటుంది. సంతోషకరమైన వార్త వింటే పొంగి పోతుంది. దుఃఖం అయితే పంచుకుని ఓదార్చుతుంది.

ఉద్యోగరీత్యా మా అమ్మాయిని డేకేర్ లో పెట్టటం ఇష్టం లేక ‘అమ్మా నాకు సాయం చెయ్యి ‘ అంటే ఎప్పుడూ వదిలి రాని తన ఇంటిని వదిలి నాతో మూడు సంవత్సరాలు ఉంది, మా అమ్మాయిని చూసుకుంటూ. పెంచిన మమకారమేమో మనవరాలి గొంతు ఫోనులో వారం వారం వినాలని తహతహ లాడుతుంది. అందుకే మా అమ్మాయి తెలుగు మరిచిపోకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాం.

చుట్టాలందరు అనేవారు అమ్మ గురించి - కూతుళ్ళని, కోడళ్ళని ఒకేలా చూస్తుందని. కూతుళ్ళే అనుకునే వారు అమ్మకి కోడళ్ళంటే ఇష్టం అని. అంత పెద్ద సంసారాన్ని ఎంతో ఓర్పుతో, బాధ్యతతో నెట్టుకొచ్చింది. తన మరుదుల్ని కూడా తన పిల్లలే అనుకుని పెళ్ళిళ్ళు చేసి, వాళ్ళ భార్యలకి పురుళ్ళు పోసింది. నాయనమ్మ పక్షవాతంతో చూపు పోగొట్టుకుని మంచంలో ఉంటే కన్న తల్లిలా సాకింది. నేనే ఎందుకు చూడాలని ఎప్పుడూ వంతులు వేసుకోలేదు.

నాన్న ప్రత్యక్షంగా అమ్మని పొగడక పోయినా మాతో అనేవారు మీ అమ్మకి ఇందిరాగాంధీకి ఉన్నంత తెలివి ఉందిరా అని. మేము కాలిక్యులేటర్లతో వేసిన దానికన్నా వేగంగా తను మెదడులోనే లెక్కలు చేయగలిగేది. ఇప్పుడు వయసుతో వచ్చిన మార్పువల్ల వేగం తగ్గింది. అమ్మ వయసు ఇప్పుడు 81 సంవత్సరాలు. తన కుటుంబమే కాకుండా తన బంధువులు, తెలిసిన వాళ్ళు చుట్టుపక్కలవాళ్ళు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అనుకుంటుంది. మా బాబాయి కొడుకు తన మేనమామ కూతుర్ని ప్రేమించి ఆమెని పెళ్ళి చేసుకోకపోతే చచ్చిపోతాను పెద్దమ్మా అంటే, వాళ్ళ పెళ్ళి మా ఇంట్లో సినిమా తరహాలో దండలపెళ్ళి చేసి పెళ్ళికూతురి తల్లిదండ్రులకి శత్రువు అయ్యింది. తన దగ్గర ఉన్నది ఎవరికైనా పెట్టాలనుకుంటుంది కానీ తనకి అవసరం అవుతుందేమో అనుకోదు.

మా నాలుగో అక్క 1980 లోనూ, నాన్న 1987 లోనూ, మూడో అన్నయ్య 2005 లోనూ చనిపోయారు. ఈ నిష్క్రమణలన్నీ మానసికంగా అమ్మ మీద చాలా ప్రభావం చూపించాయి. వీటిని తట్టుకుంటూ మిగిలిన పిల్లల బాగోగులు చూసుకుంటూ జీవన యాత్రని కత్తిమీద సాములా నడిపించుకుంటూ వచ్చింది. ఐనా ఏరోజూ ఎవరికి ఏలోటూ రాకుండా చూసిన అమ్మ నేర్పు, ఓర్పు ఇప్పటికీ నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది.

నాన్న చనిపోయాక నన్ను పై చదువులు చదివించడం తనకి భారమైనా నాన్న ఆఖరికోర్కె తీర్చడం కోసం నన్ను కష్టపడి చదివించింది. ఈ రోజున నా ఈ స్థితికి అమ్మే కారణం అంటే ఏ మాత్రం ఒప్పుకోదు. నీ చదువు నేనేమైనా చదివానా అంటుంది. అంతంటి నిరాడంబరురాలు అమ్మ.

అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆ అమ్మకి కూతురిగా పుట్టినందుకు గర్వపడుతున్నాను. జన్మజన్మలకూ ఈ అమ్మకే కూతురిగా పుట్టాలని కోరుకుంటున్నాను. ‘అమ్మ‘ అనే పదానికి అసలైన నిర్వచనం మా అమ్మ అని ఎప్పుడూ అనుకుంటూ ఉంటాను.



సుధగారు న్యూయర్క్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు సాహిత్యం అంటే చాలా ఇష్టం. భర్తా, కుమార్తెలతో న్యూజెర్సీలో నివాసం.